
24వ వార్డులో మహిళకు చీర అందిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి


50వ వార్డులో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తదితరులు


49వ వార్డులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు, పార్టీ నాయకులు


43వ వార్డులో రాజన్నకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

మహానేతా.. మనసాస్మరామి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పాలిట పెన్నిధిగా నిలిచారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొనియాడారు. మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- నియోజకవర్గంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- రాజన్నకు ప్రజలు, నాయకుల నివాళి
- వాడవాడలా సేవా కార్యక్రమాలు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో కె.కె.రాజు ఆధ్వర్యంలో మహానేత వైఎస్సార్ చిత్రపటానికి కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాజన్న సుభిక్ష పాలన స్వర్ణయుగాన్ని తలపించిందని, ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. తన తండ్రి స్ఫూర్తితో తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలందరి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. కార్యక్రమంలో వీకేపీ సీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, మాజీ కార్పొరేటర్లు జి.వి.రమణి, బాక్సర్ రాజు, బులుసు జగదీష్, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, జుబేర్, సునీత, డి.శ్రీనివాసరావు, రాయుడు శ్రీను, నూకరాజు, పండవ శ్రీను, పలువురు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు, గొడుగుల పంపిణీ

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో వైఎస్సార్ చిత్రపటానికి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి నివాళి అర్పించారు. పేద మహిళలకు చీరలు, పురుషులకు గొడుగులు పంపిణీ చేశారు. సాడి కేశవరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్ల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నక్కవానిపాలెంలోని తన కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. గుడ్ల అశోక్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు, నోట్‌బుక్స్ అందజేత

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ శివాలయం బజార్ వద్ద కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథి కె.కె.రాజు కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులు, పేదలు, చిన్నారులకు పంచారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బిస్కట్లు అందజేశారు. పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని కాపాడాలనే నినాదంతో వార్డులో మొక్కలు పంపిణీ చేశారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

43వ వార్డులో..

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పూలమాలలతో నివాళులర్పించారు. పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

49వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాజన్న సంక్షేమ పాలనను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, విశాఖ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, బీసీ సెల్ వార్డు అధ్యక్షుడు కె.ఢిల్లీరావు, వార్డు పోలింగ్ బూత్ అధ్యక్షుడు జి.రామకృష్ణ, జె.ప్రశాంత్, జీకే మహేష్, సీనియర్ నాయకులు జి.సూర్యనారాయణ, కె.అప్పారావు, శ్రీరాములు, ధవళేశ్వరరావు, సుబ్బారావు, అప్పారావు, కె.రామారావు, కె.నారాయణ, సీహెచ్ లక్ష్మి, ఆదిలక్ష్మి, సరస్వతి, రత్నం, గృహసారథులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

50, 51 వార్డుల్లో..

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మహానేత సేవలను కొనియాడారు. భగాతి విజయ్‌కుమార్, రాజేశ్వరరావు, ఏఎస్ నాయుడు, వేణు, శివరాం, సబ్బవరపు శ్రీను, రామారావు, రాంబాబు, రఘు, సీహెచ్ శ్రీను, సనపల రవికుమార్ స్వామి, సనపల రమేష్, పాతపట్నం రామ్మోహన్, ఎంవీ రెడ్డి పాల్గొన్నారు.

- 51వ వార్డు కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, బి.తిరుమలరావు, పైడి ప్రతాప్, శ్యామ్, సింహాచలం, వరలక్ష్మి, రత్నం, ధర్మావతి, రాణి, గణేష్, ధర్మేంద్ర, రాజేశ్వరరావు, పైడిరాజు, పొన్నాడ అప్పారావు, వినోద్, అప్పలనాయుడు, పైడిరాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.
- 51వ వార్డు వుడా కాలనీ లవ్ అండ్ కేర్ ఆశ్రమంలో నిర్వాహకులకు కూరగాయలు, సరకులు, అనాథ, దివ్యాంగ పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పంపిణీ చేశారు. పార్టీనాయకులు పాల్గొన్నారు.
- ఆశీల్‌మెట్ట వేమన మందిరం ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి నివాళులర్పించారు. కర్రి రామారెడ్డి, సంజీవరెడ్డి, ధర్మేంద్రరెడ్డి, దివాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి సంఘం, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


రైల్వే న్యూకాలనీలో స్థానికులకు మొక్కలు అందజేస్తున్న కె.కె.రాజు


51వ వార్డులో దివ్యాంగ పిల్లలకు చాక్లెట్లు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


నక్కవానిపాలెంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుడ్ల భాస్కరరెడ్డి తదితరులు


మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేస్తున్న గుజ్జు వెంకటరెడ్డి

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలియుగ వెంకన్నకు పూజలు


వేంకటేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెంలోని కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రధాన అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

‘ప్రవేశ రుసుం సరికాదు’

సీతమ్మధార: రుషికొండ బీచ్‌లో ప్రవేశానికి రూ.20 రుసుం వసూలు చేయాలనే నిర్ణయాన్ని వార్వా నివాస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వార్వా జనరల్ సెక్రటరీలు బి.బి.గణేష్, పిట్టా నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్‌లో ప్రవేశ రుసుం ఎక్కడా వినలేదు.. చూడలేదని, బీచ్‌లు, కొండలు, చెరువులు, నదులు సహజ సంపదని, అవి ప్రజలకే చెందుతాయన్నారు. మరుగుదొడ్లు, నీరు, ఈత సదుపాయాలు, ప్రథమ చికిత్స వంటి అదనపు వసతులు కల్పించి, అభివృద్ధి చేయడానికి అయ్యే ఖర్చు కోసం రుసుం వసూలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జీవీఎంసీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు.

హోరాహోరీగా ప్రచారం


సొసైటీ సభ్యులను కలిసి యునైటెడ్ ఫ్రంట్‌ను గెలిపించాలని కోరుతున్న అభ్యర్థులు

సింథియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్– క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. యునైటెడ్ ఫ్రంట్ సభ్యులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తారు. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి షిప్‌యార్డ్ వర్కర్స్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ –క్రెడిట్ సొసైటీ ఎన్నికలు జరుగుతాయి. తాజాగా నిర్వహిస్తున్న ఎన్నికల్లో మొత్తం 294 మంది సొసైటీ సభ్యులు ఉన్నారు. సొసైటీని 9 జోన్లుగా విభజించారు. ప్రతి జోన్‌లో సొసైటీలో ఉన్న 294 మంది ఎన్నికలో పాల్గొంటారు. జోన్‌లో పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా సంబంధిత జోన్‌లో సభ్యుడై ఉండాలని అధికారులు సూచించారు. యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులే సొసైటీని అభివృద్ధి చేస్తున్నారని.. మళ్లీ తమకే అవకాశం ఇవ్వాలని గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి చంటిబాబు, అధ్యక్షుడు రమణమూర్తి సొసైటీ సభ్యులను కోరారు.

నేటి నుంచి మండలాభిషేకాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో రెండు రోజుల పాటు మండలాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం, సోమవారం ఉదయం విశేష పూజలు, ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సీజనల్ వ్యాధులపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. రేసవానిపాలెంలోని శాఖ కార్యాలయంలో శనివారం పలు జాతీయ కార్యక్రమాలపై ఆయన జూమ్ మీటింగ్, టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముండటంతో అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులు, గర్భనిరోధక మాత్రలు, శాశ్వత పద్ధతుల్లో వ్యాసెక్టమీ, ట్యూబెక్టమీ పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, నోడల్ అధికారి డాక్టర్ ఎస్.రమారెడ్డి, డాక్టర్ కృష్ణవేణి, తులసి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర ప్రొగ్రాం అధికారులు మరియమ్మ, హర్ష, శారద, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి


విశాఖ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు కిందపడి గుర్తు తెలియని ఒక యువకుడు మృతిచెందాడు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నం.4లో పూరి–తిరుపతి రైలు వెళ్లిన అనంతరం శనివారం ఉదయం సుమారు 4.30 గంటలకు గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుంది. నలుపు రంగు టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. యువకుడి వద్ద జూలై 6న అన్నవరం నుంచి విశాఖపట్నం వరకు తీసుకున్న జనరల్ టికెట్ మాత్రం ఉంది. మరే ఇతర ఆధారాలు లేవు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు సూచనల మేరకు ఎస్ఐ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి సమాచారం తెలిసిన వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్ వద్ద స్వయంగా గానీ లేదా 0891–2882910, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

గోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతాలవాసులకు శుభవార్త

త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్‌వే ఏర్పాటు

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, చంద్రనగర్, సింహాచలం ప్రాంత ప్రజలకు వాల్తేర్ డివిజన్ శుభవార్త తెలిపింది. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అనితర కృషితో ఈ ప్రాంతంలో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్‌వే ఏర్పాటుకానుంది. దీని ద్వారా సింహాచలం రైల్వేస్టేషన్‌కు అటు, ఇటు గ్రామాల ప్రజల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. ఈ ప్రాంతంలో గల లెవెల్ క్రాసింగ్ ఎప్పుడు మూసి ఉండడం, లేదా క్రాసింగ్స్ కింద నుంచి ట్రాక్స్ మీదుగా నిత్యం ప్రజలు రాకపోకలు సాగించడం జరుగుతుంది. దీనివల్ల అనేకసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికే స్థానికులు, ప్రజాప్రతినిధులు డీఆర్ఎంకు వినతులు సమర్పించారు. ప్రస్తుత డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ప్రాజెక్టుకు వెంటనే మంజూరు చేయించారు. ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి అధికారికంగా ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ వివరాలను ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద గల ఎస్‌పీ–1,ఎస్ఎస్1 లెవెల్ క్రాసింగ్స్ వద్ద ఈ లిమిటెడ్ హైట్ సబ్‌వే రానుంది. కట్ అండ్ కర్వ్ పద్ధతిలో బాక్స్ కేస్టింగ్స్‌తో ఈ సబ్‌వేను ఏర్పాటుచేయనున్నారు. దీనికి సంబంధించిన బాక్స్‌ల తయారీ ఇప్పటికే ప్రారంభమైందని డీఆర్ఎం తెలిపారు. ఈ సబ్‌వే నవంబరు నాటికి పూర్తి కావచ్చని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 10న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ(ఆపరేషన్స్) జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, కిరణ్ పార్క్, రాఘవేంద్ర హాస్పిటల్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తండ్రిపై కొడుకు దాడి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కొడుకు తండ్రిపై దాడి చేసిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం దయాల్‌నగర్‌లో బి.నాగరాజు కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడి కుమారుడు ధనుష్‌కుమార్ తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి డబ్బుల కోసం గొడవలు పడుతూ ఉంటాడు. ఈ నెల 5న రాత్రి 11 గంటలకు తాగివచ్చి తండ్రిని డబ్బులు అడగ్గా.. లేవని చెప్పడంతో ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. అడ్డు వచ్చిన తల్లిని, మిగతా కుటుంబ సభ్యులను తిట్టాడు. తండ్రికి బుగ్గపై గాయం కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందాడు. శనివారం రాత్రి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి నాగరాజు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

13, 14 తేదీల్లో ప్రతిభా పోటీలు

డాబాగార్డెన్స్: మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కళా ఉత్సవ్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఆ రెండు రోజులు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటల్, డ్రాయింగ్, పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ, గెటప్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు 9966485335కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

‘ప్రజాసంకల్ప యాత్ర’ పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలో చేసిన ప్రజాసంకల్ప యాత్రను పుస్తక రూపంలో ఆంధ్రా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగం ఆచార్యుడు డాక్టర్ పేటేటి ప్రేమానందం తీసుకొచ్చారు. దీనిని శనివారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగిన ప్రజాసంకల్ప యాత్రకు సంబంధించిన సమస్త సమాచారాన్ని అందించే పుస్తకంగా దీనిని రచయిత తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన


శ్రీనివాసనగర్ గెడ్డపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్ గెడ్డపై రూ.33.50 లక్షలతో పాత బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తున్నారు. ఈ పనులను శనివారం ఉదయం కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాలకు ఇరుకైన రహదారులు ఉండటంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా వచ్చే అవకాశం లేక ఏళ్ల తరబడి నివాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నప్పుడు శ్రీనివాసనగర్ గెడ్డపై బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరిస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఈ మేరకు స్థానికుల సమస్య తీరేలా విశాలమైన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. దీంతో 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్, నందగిరినగర్, జగన్నాథపురం ప్రాంతాలకు నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గం సుగమమవుతుందన్నారు. ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం లభిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మదిని దోచిన చిత్ర గీతాలు


సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన శ్రీదేవి మహానటి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ‘ప్రేమ బృందావనం’పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. రాము, రమణి పాడిన ముందరున్నా చిన్నదాన్ని.. సింగర్ రాజు, కవిత పాడిన నిలగిరి చల్లన.. ఏవీ నాగేశ్వరరావు, సాత్విక పాడిన పూజలకు వేళాయెరా..., హేమంత్, సుజాత పాడిన కొత్తగా రెక్కలొచ్చెనా..., అభినయ, కందర్ప రాధ పాడిన కొంతకాలం కొంత కాలం..., నెహ్రూ పాడిన వివాహ భోజనంబు వంటి ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలు ప్రేక్షకులను అలరించారు. ముందుగా కళారంగ ప్రముఖుడు కొణతాల రాజు, ఫణిస్వామి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, ప్రముఖ వ్యాఖ్యాతలు పి. రాజేంద్రప్రసాద్, పి. అభిషేక్, విజయరమణి, సంస్థ గౌరవ అధ్యక్షుడు జేఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి


877వ రోజు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్తు తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 877వ రోజు శనివారం ఆర్ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో శనివారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా–తిరుపతి (20889) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ –షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం– లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ –హౌరా (12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–చెన్నై సెంట్రల్ (12839)మెయిల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరాయి.